

బతుకు పోరాటం

ఆధునిక పరికరాలు అందుబాటులోకి వచ్చినా చేతి వృత్తినే నమ్ముకున్న 90 ఏళ్ల కత్తుల రత్తయ్య కథ..

8లో



కేజీహెచ్ ప్రగతికి సూచనలు

డాబాగార్డెన్స్: అదనపు డీఎంఈ వేంకటేశ్వరరావు కేజీహెచ్‌ను సందర్శించారు. నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు.

ఉష్ణోగ్రతలు

	గరిష్ఠం	కనిష్ఠం
అనకాపల్లి	36.2	27.0
చోడవరం	37.0	27.0

అనకాపల్లి: రాగల ఐదు రోజులు వాతావరణం మేఘావృతమై, తేలికపాటి వర్షం పడే అవకాశం ఉందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం తెలిపారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా అమర్‌నాథ్



సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ, అనకాపల్లి జిల్లాల పార్టీ అధ్యక్షులను నియమించింది. పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. వైఎస్సార్ సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, విశాఖ జిల్లా అధ్యక్షుడిగా ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు నియమితులయ్యారు.

మొగ నుంచి బోట్లు తొలగించాలి

- ఎస్‌డీసీ మనోరమ సూచన

ఎస్.రాయవరం: బంగారమ్మపాలెం నేవల్ నిర్మాణ పరిధిలో మొగ నుంచి సముద్రంలోనికి వెళ్లే బోట్లు తొలగించి సముద్ర మార్గం వద్ద పెట్టుకోవాలని నేవల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మనోరమ సూచించారు. గ్రామంలో మత్స్యకార పెద్దలు, ప్రజాప్రతినిధులతో మంగళవారం ఆమె అత్యవసర సమావేశం నిర్వహించారు. శారద, వరాహ నదుల కలయిక వద్ద ఉన్న సముద్ర మార్గంలో చేపల బోట్లు రాకపోకలు సాగించేందుకు వీలు కుదరదని చెప్పడంతో గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. తాము ఇప్పుడు బోట్లు మార్చుకుని, తరువాత గ్రామాన్ని మార్చుకుని బతుకు తెరువు ఎలా కొనసాగించాలని, తాము ఎక్కడ స్థిర నివాసం ఉండాలి, చేపల వేట ఎలా చేసుకోవాలనే సందేహాలకు అధికారులు సమాధానం ఇవ్వాలన్నారు. తమ గ్రామాన్ని ఎక్కడికి తరలిస్తున్నారని ప్రశ్నించారు. తరలించకపోతే తాము పూర్వం నుంచి వేట సాగించే సముద్ర మార్గాన్ని ఎందుకు బంద్ చేస్తున్నారన్నారు. మత్స్యకారులు చేపల వేట పూర్తిగా మానెయ్యాలంటే రూ.40 వేల వంతున భృతి చెల్లించాలన్నారు. జిల్లా అధికారులకు నివేదిస్తామని మత్స్యశాఖ జేఈ ప్రసాద్, ఎస్ఐ విభీషణరావు, సర్పంచ్ మైలపల్లి శ్రీనివాసరావు వారికి బదులిచ్చారు.

ప్రజాస్వామ్యం అపహాస్యం

- ప్రలోభాలు.. బెదిరింపులతో కూటమి కుట్ర
- బలం లేక కౌన్సిలర్లను కొనేశారు
- మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు మండిపాటు



యలమంచిలిలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు

యలమంచిలి రూరల్: బలం లేకపోయినా వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను బెదిరించి, ప్రలోభపెట్టి అనైతికంగా కూటమికి మద్దతునిచ్చేలా చేశారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కన్నబాబురాజు ఆరోపించారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రక్రియలో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలైందని ధ్వజమెత్తారు. మంగళవారం యలమంచిలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికారం కోసం కూటమి పార్టీల నాయకులు పాల్పడుతున్న కుట్రలపై మండిపడ్డారు. పట్టణంలోని 25 వార్డుల్లో 23 చోట్ల వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లే ఉన్నా అవిశ్వాసం వీగిపోవడానికి కూటమి కుట్రలు, బెదిరింపులే కారణమన్నారు. మెజార్టీ లేకపోయినా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కుట్రలకు పాల్పడుతున్నారన్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే పట్టణాభివృద్ధి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే యలమంచిలి అభివృద్ధి చెందిందని, కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత గత 10 నెలల కాలంలో పట్టణ ప్రగతి పూర్తిగా కుంటుపడిందని కన్నబాబురాజు అభిప్రాయపడ్డారు. యలమంచిలిలో కొక్కిరాపల్లి రైల్వేగేటు వద్ద ఫైవంతెన తమ ప్రభుత్వ హయాంలోనే పూర్తయిందన్నారు. రైల్వేస్టేషన్ రోడ్డు విస్తరణ, యానాద్రి కాల్వలో పూడికతీత వంటి ముఖ్యమైన పనులన్నీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక పట్టణ ప్రజలకు తాగునీరందించే రక్షిత మంచినీటి పథకం పనులు ఆగిపోయాయన్నారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం మెయిన్ రోడ్డు విస్తరణ జరగలేదన్నారు. రాబోయే కాలంలో మున్సిపల్ పాలకవర్గ సమావేశాల్లో తమ పార్టీ వార్డు కౌన్సిలర్లంతా ప్రజా సమస్యలపై తమ వాణిని గట్టిగా వినిపిస్తారన్నారు. ఎంపీపీ బోదెపు గోవింద్, మున్సిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వర్రావు, అర్రెపు గుప్తా, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొద్దపు ఎర్రయ్యదొర, కౌన్సిలర్లు పిట్టా సత్తిబాబు, దూది నర్సింహమూర్తి, దాసరి కుమార్, పిల్లా త్రినాథ్‌రావు, ఈరిగిల గణేష్, గొర్లి వెంకట్, పదాల శ్రీను, కోరుబిల్లి శ్రీను, దుంగా అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

అ'సంతృప్త' కౌన్సిలర్లు గైర్హాజరు

- అవిశ్వాసం వీగిపోయిందని ప్రకటించిన ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి



సభ్యులు రాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

అచ్యుతాపురం: నాటకీయ పరిణామాల మధ్య యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారిపై పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. వైఎస్సార్ సీపీ తరఫున చైర్‌పర్సన్‌గా ఎంపికైన రమాకుమారి బీజేపీ తీర్థం పుచ్చుకోవడంతో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ఆమెపై అవిశ్వాసానికి గత నెల 27న నోటీస్ ఇచ్చారు. ఓటింగ్ నిర్వహించేందుకు మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించగా.. నోటీసు ఇచ్చిన వారే గైర్హాజరయ్యారు. ఇందుకు క్యాంపు రాజకీయాలే కారణమన్నది బహిరంగ రహస్యమే. ఉదయం 10.30 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న ఆర్డీవో వి.వి.రమణ సభ్యులందరికీ సమాచారం ఇచ్చినా ఎవరూ హాజరు కాలేదు. దీంతో మధ్యాహ్నం 12 గంటలకు సమావేశాన్ని నిర్వహిస్తామని ప్రకటించారు. అప్పటికీ సభ్యులెవ్వరూ రాకపోవడంతో.. అవిశ్వాసం కోసం నిర్వహించిన సమావేశం కోరం లేక రెండుసార్లు వాయిదా పడిందని, తద్వారా వీగిపోయిందని ఆర్డీవో ప్రకటించారు.

కలుపు ఖతం

- చెరకు తోటల్లో కలుపు మొక్కలను తొలగించే యంత్రం
- బ్యాటరీతో నడిచేలా రూపొందించిన అగ్రికల్చర్ పాలిటెక్నిక్ విద్యార్థులు
- రూ.50 ఖర్చుతో రోజుకు 2 ఎకరాల్లో కలుపు మొక్కల తొలగింపు
- రైతులకు కూలీల ఖర్చు ఆదా

అగ్రికల్చర్ పాలిటెక్నిక్ విద్యార్థులు అరుదైన ఘనతను సాధించారు. చెరకు రైతుకు మేలు చేకూరేలా.. కూలీల ఖర్చు తగ్గేలా బ్యాటరీలతో నడిచే కలుపు మొక్కలను తొలగించే యంత్రాన్ని తయారు చేశారు. అనకాపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తల పర్యవేక్షణలో అగ్రికల్చర్ పాలిటెక్నిక్ ఇంజినీరింగ్ టీచింగ్ అసోసియేట్ డాక్టర్ బి.నాగేశ్వర్, వైస్ ప్రిన్సిపల్ జి.కుసుమ మార్గదర్శకత్వంలో వారు ఈ చార్జింగ్ యంత్రాన్ని రూపొందించారు.



వీడర్‌తో చెరకు తోటలో కలుపు మొక్కల తొలగింపు



తయారు చేసిన వీడర్‌తో అగ్రికల్చర్ పాలిటెక్నిక్ ఇంజనీరింగ్ విద్యార్థులు

సాక్షి, అనకాపల్లి: చెరకు పంటలో తరచు కలుపు నివారణ చేస్తూ ఉండాలి. దవ్వ నాటిన దశ నుంచి పెరిగి పెద్దయ్యే వరకు సుమారు పదిసార్లు కలుపు మొక్కలను తొలగించాల్సి ఉంటుంది. సాధారణంగా ఒక ఎకరా భూమిలో కలుపు తీయడానికి 20 మంది కూలీల అవసరం పడుతుంది. ఎనిమిది నుంచి 10 వేల వరకు ఖర్చవుతుంది. ప్రస్తుతం మార్కెట్‌లో వీడర్లు (కలుపు మొక్కలు తొలగించే యంత్రాలు) అందుబాటులో ఉన్నాయి కానీ అవి పెట్రోల్, డీజిల్ ఇంజిన్లతో నడిచేవి. ఒక గంటకు 2–3 లీటర్ల ఇంధనం అవసరమవుతుంది. అంతే కాకుండా అధిక ప్రకంపనల వల్ల రైతు త్వరగా అలసిపోయి సగటున రోజుకు అర ఎకరం కంటే ఎక్కువ కలుపు తీయలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఇంధన కాలుష్యం వల్ల రైతు దీర్ఘకాలిక వ్యాధులకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కాలుష్య రహితంగా బ్యాటరీతో నడిచే వీడర్‌ను వ్యవసాయ పాలిటెక్నిక్ ఇంజినీరింగ్ మూడో సంవత్సర విద్యార్థులు రూపొందించారు. జాహ్నవి రాణి, మణిరత్నం, వైవీఎస్ ప్రశాంత్, ఎం.అజయ్, ఎం.లావణ్య, ఇ.సాయి సుదర్శిని, ఎస్‌కే జనార్దన్, రేష్మ, భాను తదితరులతో కూడిన విద్యార్థుల బృందం ఈ వీడర్‌ను తయారు చేశారు. ఆర్‌ఏఆర్‌ఎస్ ప్రధాన శాస్త్రవేత్త పీవీకే జగన్నాథరావు, అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ సీహెచ్ ముకుందరావు, చెరకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఇ.ఆదిలక్ష్మి, డాక్టర్ పి. శ్రీదేవి శాస్త్రవేత్తల బృందం సమక్షంలో ఈ వీడర్‌ను ప్రదర్శించారు.

చార్జింగ్‌కు 4 యూనిట్ల విద్యుత్

ఒకసారి బ్యాటరీని చార్జింగ్ చేస్తే నిర్విరామంగా రెండు గంటల వరకు వీడర్‌ను నడిపించవచ్చు. రోజుకు సగటున రెండు ఎకరాల చెరకు తోటలో కలుపు తీసుకునేలా రూపొందించారు. ఒకసారి ఈ బ్యాటరీలను చార్జింగ్ చేయడానికి 4 యూనిట్ల విద్యుత్ అవసరం. ఈ విధంగా రోజుకు కేవలం రూ.50ల ఖర్చుతో 2 ఎకరాల చెరకు తోటలో కలుపు తీసేలా తయారు చేశారు.

విద్యార్థులు రూపొందించిన వీడర్ ప్రత్యేకతలివీ..

- బయట మార్కెట్‌లో నడిపే డీజిల్, పెట్రోల్ వీడర్ల ధర రూ.80 వేల నుంచి రూ.లక్షా 20 వేల వరకు ఉంది. ప్రతి అరగంటకు ఒక్కసారి 20 నిమిషాలపాటు విశ్రాంతి తీసుకుంటేనే పనిచేస్తుంది. మన్నిక తక్కువ. బ్యాటరీ వీడర్‌ను రూ.60 వేల నుంచి రూ.65 వేలకు మార్కెట్‌లో అందుబాటులో ఉండేలా రూపొందించారు.
- 90 నుంచి 120 సెం.మీ. వెడల్పులో కలుపు మొక్కలను తొలగిస్తుంది. ఇది 35 డిగ్రీల ఉష్ణోగ్రతను మించకుండా నియంత్రిస్తుంది.
- బయట మార్కెట్‌లో ఉన్న వీడర్లను లిథియమ్ అయాన్ బ్యాటరీలతో తయారు చేయడంతో అవి పేలుతున్నాయి. అందుకే దీనిని గ్రాఫైన్ బ్యాటరీలతో తయారు చేశారు. ఈ బ్యాటరీలతో ఎటువంటి ప్రమాదం ఉండదు.

ఆరు నెలల్లో మార్కెట్‌లోకి..



తక్కువ ధర.. ఎక్కువ లాభదాయకంగా ఉండేలా చెరకు కలుపు మొక్కలను తొలగించే వీడర్‌ను రూపొందించాం. ప్రస్తుతం యూనివర్శిటీ స్థాయిలో టెస్టింగ్‌లో ఉంది. ఇటీవల రైతు కిసాన్ మేళాలో ఈ యంత్రానికి రైతుల నుంచి మంచి స్పందన కూడా వచ్చింది. ఇది పూర్తి స్థాయిలో మార్కెట్‌లోకి అందుబాటులోకి రావడానికి 6 నెలలు పడుతుంది.

–డాక్టర్ బి.నాగేశ్వర్, టీచింగ్ అసోసియేట్, అగ్రికల్చర్ పాలిటెక్నిక్ ఇంజినీరింగ్, అనకాపల్లి

రెండు నెలల సమయం పట్టింది..



ప్రాజెక్టు వర్కులో భాగంగా కలుపు తీయడానికి దీన్ని రూపొందించాం. చెరకు రైతులకు ఉపయోగపడేలా ఒక మంచి ప్రాజెక్టు చేద్దామన్న ఆలోచనే ఇందుకు నాంది పలికింది. సులువుగా కలుపు తీసేలా.. ఆరోగ్యకరంగా ఉండేలా దీనిని రూపొందించాం. అనుకున్న ప్రయోజనాలన్నీ నెరవేరాయి. దీన్ని తయారు చేయడానికి రెండు నెలల సమయం పట్టింది.

– మణిరత్నం, అగ్రికల్చర్ పాలిటెక్నిక్ ఇంజినీరింగ్ విద్యార్థి

ఆధునిక పరికరాలు అందుబాటులోకి వచ్చిన తర్వాత చేతి వృత్తులవారి పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. పల్లెల్లో ఒకప్పుడు వినియోగించే పరికరాలు ఇప్పుడు కాన రావడం లేదు. యంత్ర పరికరాలు వీరి జీవనోపాధిని దెబ్బతీశాయి. అయినప్పటికీ కులవృత్తి సాటిరాదు గువ్వల చెన్నా అంటూ తొంబై ఏళ్ల వృద్ధుడు తరతరాలుగా వస్తున్న కులవృత్తిని వదులుకోలేక, తన కాళ్లపై తానే నిలబడి బతకాలనే ఉద్దేశంతో గ్రామాల్లో తిరుగుతూ కులవృత్తి ద్వారా నేర్చుకున్న విద్యతో కత్తిపీటలు, తవుగోలలు తయారు చేసి విక్రయిస్తూ బతుకుతున్నాడు. నక్కపల్లి మండలం న్యాయంపూడి గ్రామానికి చెందిన కొత్తలి వీరభద్రుడు తొమ్మిది పదుల వయసులో చేస్తున్న బతుకు పోరాటం ఈ తరానికి భావితరాలకు ఆదర్శంగా నిలుస్తోందనడంలో సందేహం లేదు.



కత్తిపీటలు తయారు చేసే పనిలో వీరభద్రుడు



కత్తిపీటతో బతుకు పోరాటం

నక్కపల్లి :

న్యాయంపూడి గ్రామానికి చెందిన కొత్తలి వీరభద్రుడు వయసు 90 ఏళ్లు సాధారణంగా ఆ వయసులో ఉన్న వారెవరైనా ఇంటికే పరిమిత మవుతారు. రామ, కృష్ణా అంటూ కుటుంబ సభ్యులు పెట్టింది తిని ఒక మూలన కూర్చొని కాలం వెళ్లదీస్తారు. కానీ కాటికి కాలు చాచిన వయసులో ఈ వృద్ధులు ఇంటికే పరిమితం కాలేదు. ఒంట్లో ఓపిక లేకపోయినా, ఎవరిపైనా ఆధారపడకుండా తన కాళ్లపై తాను నిలబడుతూ బతుకు బండిని లాగిస్తున్నాడు. కులవృత్తి కూడు పెట్టకపోయినా తరతరాలుగా దాన్నే నమ్ముకుని జీవించిన రోజులను గుర్తుచేసుకుంటూ ఊపిరి ఉన్నంత వరకు ఇదే వృత్తిని కొనసాగించాలని, కులవృత్తినే నమ్ముకుని జీవించాలని బలంగా అనుకున్నాడు. తాను తయారు చేసిన కత్తిపీటలను భుజాన వేసుకుని ఊతకర్ర చేత పట్టుకుని కాలినడకన ఊరూరా తిరుగుతూ అమ్ముకుంటూ పొట్ట పోషించుకుంటున్నాడు. కమ్మర కులానికి చెందిన వీరభద్రుడు తన 11వ ఏటనే కులవృత్తిలో చేరాడు. రైతాంగం వ్యవసాయం చేసే సమయంలో వారికి అవసరమైన కత్తులు, కొడవళ్లు, తవ్వగోల(బొరికే), కర్రుకోల, కాడెలు వంటి వ్యవసాయ పనిముట్లు తయారు చేసేవాడు. కాలక్రమంలో ఈ పనిముట్లు కనుమరుగయ్యాయి. రైతాంగం కూడా నూతన సాంకేతిక పరిజ్ఞానానికి అలవాటు పడింది. యంత్రపరికరాలు అందుబాటులోకి రావడంతో చేతి వృత్తుల వారు తయారు చేసే పనిముట్లను పక్కన పడేసారు.

వాటిని వినియోగించినన్నాళ్లు వీరభద్రుడి బతుకు నల్లేరు పై నడకలానే సాగింది. అయితే కమ్మర్లు తయారు చేసిన పనిముట్లను రైతులు వాడడం మానేయడంతో వీరభద్రునికి కష్టాలు మొదలయ్యాయి. ఆదాయం తగ్గిపోవడంతో పూట గడవడం కష్టమయింది. **కులవృత్తిలోనే మరో పనిని వెతుక్కున్నాడు. కత్తిపీటలను తయారు చేసి విక్ర**యించడం మొదలు పెట్టాడు.

తరతరాలుగా కొనసాగిస్తున్న కమ్మరం ఇంట్లోనే ఉంది. తుని పట్టణానికి వెళ్లి కత్తిపీటల తయారీకి అవసరమైన చెక్క, ఇనుప ముక్కలను కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నాడు. ఇనుప ఊచలను నిప్పుల కొలిమిలో కాల్చి ఇనుప దిమ్మెపై కత్తి రూపం వచ్చే దాకా బరువైన సుత్తితో మోదుతాడు. రోజుకు నాలుగైదు కత్తిపీటలను తయారు చేయగలుగుతున్నాడు. తాను తయారు చేసిన కత్తిపీటలను ఆరు నుంచి ఏడు వరకు తయారు గ్రామాల్లో కత్తిపీటలమ్మ... కత్తిపీటలు.. అని అరుస్తూ విక్రయిస్తుంటాడు. కత్తిపీట ఒక్కొక్కటి రూ.100లకు విక్రయిస్తున్నాడు. ఒక్కోసారి సరిగా అమ్ముడు కాకపోతే ఇరవయ్యో, ముప్పయ్యో తగ్గించి ఇచ్చేస్తాడు. బేరాలు లేకపోతే ఉసూరు మంటూ కత్తిపీటలను చేతపట్టి ఇంటికి తిరిగొస్తాడు.

కత్తిపీటలతో పాటు తవ్వగోలను కూడా తయారు చేసి విక్రయిస్తాడు. అయితే అవి గిట్టుబాటు కాకపోవడం తయారీకి రూ.100 ఖర్చవుతుందని, కొనేవాళ్లు మాత్రం రూ.70కి మించి అడగడం లేదని దీంతో కత్తిపీటల తయారీకే మొగ్గుచూపుతున్నానని వీరబద్రుడు తెలిపాడు. కత్తిపీట తయారు చేసి విక్రయిస్తే రూ.30 మాత్రమే మిగులుతుందని చెబుతున్నాడు. ఇనుప ఊచకొంటే రూ.70 అవుతుందని, రెండు కత్తిపీటలకు సరిపోతుందంటున్నాడు. పీటల చెక్కకు మరో రూ.20 బొగ్గులకు రూ.20 ఖర్చు అవుతుందన్నాడు. కత్తిపీట తయారు చేసి రూ.100లకు విక్రయిస్తే రూ.30 మిగులుతుందన్నాడు. ఆటోలో వెళ్లి అమ్మితే పైసా మిగలదని, అందుకే నడకనే వెళ్లి అమ్ముకుంటానని చెబుతున్నాడు.



వీరభద్రుడు నివసిస్తున్న చిన్న పెంకుటిల్లు

ఎవరిమీదా ఆధారపడడం ఇష్టంలేకే...

వీరభద్రునికి అరడజను సంతానం, ఐదుగురు కొడుకులు, ఒక కూతురు. వీరందరికీ వివాహాలై ఎవరి బతుకులు వాళ్లు బతుకుతున్నారు. వీరభద్రుడు మాత్రం వీరెవరి మీద ఆధారపడి బతకడం లేదు. వయసు మీద పడి శరీరం సహకరించకపోయినా లేని శక్తిని కూడగట్టుకుని సత్తువ తెచ్చుకుని తన కులవృత్తినే కొనసాగిస్తున్నాడు. పిల్లలంతా ఎవరి బతుకులు వాళ్లు బతుకుతున్నారు..వాళ్లకు భారం కాకూడదు, ఓపిక ఉన్నన్నాళ్లు చేద్దాం అనే ఉద్దేశ్యంతో ఈ పనిసేత్తన్నాను అని తెలిపాడు.



కత్తిపీటలను పట్టుకుని పల్లెల్లో అమ్ముతున్న వీరభద్రుడు

ఓపికున్నన్నాళ్లు కష్టపడతా...



పెబుత్వం పెతినెలా నాలుగేలు పించని ఇస్తంది..కత్తిపీటలు చేసి అమ్ముతూ మరో ఎయ్యి రూపాయలు సంపాదిత్తాన్నాను. ఈ డబ్బుతో మాయావిడా, నేను కాలం ఎల్లదీత్తన్నం. నాకు జబ్బునేమీనేవు. ఈమద్య కొంత ఆయాసం వత్తాంది. పెద్దకొడుకు ఆస్పత్రికి తీసుకెళ్లి రక్తం ఎక్కించాడు. సిన్నప్పటి నుంచి సుట్టకాల్చడం అలవాటు దాన్నే మానుకోనేకపోతన్నా. తొంబై ఏళ్లు వచ్చాయి, సేతిలో సేవ, ఒంట్లో ఓపిక ఉన్నంతకాలం కత్తిపీటలు అమ్ముతూనే కాలక్షేపం సేత్తాను. ఎవరి మీద ఆదారపడను.

– వీరభద్రుడు , తయారీదారుడు

దివ్యాంగ విద్యార్థుల జయకేతనం

- రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులకు పతకాలు



రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో ఐదు పతకాలు సాధించిన జిల్లా దివ్యాంగ విద్యార్థులు

తుమ్మపాల: విజయవాడలోని హీల్ పారడైజ్ స్కూల్లో జరిగిన రాష్ట్రస్థాయి స్పెషల్ ఒలింపిక్ భారత్ –2025 క్రీడా పోటీల్లో జిల్లాకు చెందిన నలుగురు దివ్యాంగులు ఉత్తమ ప్రతిభ కనబరచి ఐదు పతాకాలు సాధించినట్లు జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ జయప్రకాష్ తెలిపారు. ఈ నెల 21 నుంచి 23 వరకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష ప్రాజెక్టు, స్పెషల్ ఒలింపిక్ భారత్ కమిటీ ఆధ్వర్యంలో మేధో వైకల్యం, ఆటిజం, డౌన్ సిండ్రోమ్, మస్తిష్క పక్షవాతం గల ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు నిర్వహించిన పలు క్రీడా పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు, ప్రశంసా పత్రాలు సాధించినట్టు ఆయన తెలిపారు. అసిస్టెడ్ వాక్ క్రీడా పోటీల్లో పరవాడ మండలానికి చెందిన ఎం.శ్రావణ్ జోషిత్ ద్వితీయ స్థానం సాధించి సిల్వర్ మెడల్‌ను, అనకాపల్లి మండలానికి చెందిన ధోని భాస్కర్ 200 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించి సిల్వర్ మెడల్, 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానంతో సిల్వర్ మెడల్‌ను సాధించారు. రావికమతం మండలానికి చెందిన మల్లేటి ఆనంద్ 100 మీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానం సాధించి బ్రాంజ్ మెడల్‌ను, 50 మీటర్ల పరుగు పందెం విభాగంలో బుచ్చెయ్యపేట మండలానికి చెందిన బి.మనోజ్ తృతీయ స్థానం సాధించి బ్రాంజ్ మెడల్‌ను సాధించినట్లు ఆయన తెలిపారు. పతకాలు సాధించిన దివ్యాంగ విద్యార్థులతోపాటు ఎస్కార్టులుగా వ్యవహరించిన స్పెషల్ ఎడ్యుకేటర్లు మహాలక్ష్మి నాయుడు, పోలిరాజులను కూడా జిల్లా విద్యాశాఖ అధికారులు, సమగ్ర శిక్ష ప్రాజెక్టు ఉన్నత అధికారులు అభినందించారు.

నిర్వాసితుల జాబితాలపై విచారణ

నక్కపల్లి: మండలంలో ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో ఇళ్లు, నివాస స్థలాలు కోల్పోయిన వారికి పునరావాసం కల్పించేందుకు గుర్తించిన నిర్వాసితుల జాబితాలపై రెవెన్యూ, ఏపీఐఐసీ అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. చందనాడ, వేంపాడు, అమలాపురం, డీఎల్‌పురం, రాజయ్యపేట, బోయపాడు గ్రామాల్లో సుమారు 4,500 ఎకరాలు సేకరించిన విషయం తెలిసిందే. వీటిలో 2 వేల ఎకరాలు బల్క్ డ్రగ్ పార్క్‌కు, మరో 2,500 ఎకరాలు మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించారు. బల్క్ డ్రగ్ పార్క్‌కు కేటాయించిన రాజయ్యపేట, బోయపాడు, పాటిమీద, మూలపర, తమ్మయ్యపేట గ్రామాల్లో సుమారు 750 కుటుంబాలను ఖాళీ చేయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వీరందరికి పునరావాసం ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లించాలి. పెద బోదిగల్లం వద్ద ఐదు సెంట్ల ఇంటి స్థలం, నిర్వాసిత కుటుంబాల్లో 18 ఏళ్లు నిండిన వారికి రూ.8.30 లక్షల చొప్పున ఆర్అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు లబ్ధిదారుల జాబితాలు సిద్ధం చేసింది. గ్రామసభలు నిర్వహించిన బహిర్గతం చేసింది. అయితే లబ్ధిదారుల జాబితాలో అవకతవకలు జరిగాయని, స్థానికంగా నివాసం లేని వారి పేర్లు కూడా జాబితాల్లో నమోదు చేశారంటూ గ్రామసభల్లో కొంత మంది ఫిర్యాదు చేశారు. అలాగే చాలా మంది అర్హుల పేర్లు జాబితాల్లో లేవని, వారికి కూడా ప్యాకేజీ వర్తింజేయాలంటూ దరఖాస్తులు వచ్చాయి. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో అధికారుల బృందం ఇంటింటికి వెళ్లి విచారణ చేపట్టింది. నిర్వాసితుల వద్ద ఉన్న అన్ని ఆధారాలను అధికారులు పరిశీలించారు. ఏపీఐఐసీకి ఎంత భూమి ఇచ్చారు.. ఎక్కడ నివాసం ఉంటున్నారు.. ఇంటి పన్ను రశీదు వంటి వివరాలు సేకరిస్తున్నారు. జాబితాలు విచారణ చేసి నివేదిక సమర్పిస్తామని తహసీల్దార్ నర్సింహమూర్తి తెలిపారు.



నిర్వాసితుల జాబితాలపై విచారణ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

విద్య, విజ్ఞానం ఎంతో అవసరం

అనకాపల్లి టౌన్: విద్యార్థులకు చదువుతో పాటు విజ్ఞానం కూడా ఎంతో అవసరమని డీఈవో గిడ్డి అప్పారావునాయుడు తెలిపారు. స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వైజ్ఞానిక స్టడీ టూర్ బస్సును మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. విద్యాశాఖ కార్యాలయం నుంచి బయలు దేరి విశాఖపట్నంలో వివిధ ప్రదేశాలను సందర్శించారు. ఆంధ్ర యూనివర్సిటీ, విశాఖ బీచ్ వద్ద ఉన్న సబ్‌మెరైన్, టీ142 ఎయిర్ క్రాఫ్ట్, మ్యూజియంలను సందర్శించారు. ఈ ఏడాది జనవరిలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 96 మంది విద్యార్థులను, 15 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఈ స్టడీ టూర్‌కు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో కాళిదాస్, ఏఎంవో మురళీమోహన్ పట్నాయక్ పాల్గొన్నారు.



టీ142 ఎయిర్ క్రాఫ్ట్‌ను సందర్శించిన విద్యార్థులు

జాతీయ ఆర్ట్స్ కాంపిటేషన్‌లో గురుకుల విద్యార్థుల సత్తా

దేవరాపల్లి: జాతీయ స్థాయి ఆర్ట్స్ కాంపిటేషన్‌లో తెనుగుపూడిలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయం విద్యార్థులు సత్తా చాటారు. విజయవాడలో ఆల్ ఇండియా యూత్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్స్ అకాడమీ అండ్ ఎగ్జిబిషన్ ఆధ్వర్యంలో మార్చిలో నిర్వహించిన ఈ పోటీలలో గురుకుల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఐదుగురు గోల్డ్ మెడల్స్, ఏడుగురు సిల్వర్ మెడల్స్‌ను సొంతం చేసుకున్నారు. గురుకుల విద్యాలయానికి చెందిన ఎస్.రాజ్‌కుమార్, కె.మధన్, వై.నరేంద్ర, జి.జగదీష్, పి.విజయ్ బంగారు పతకాలను, జి.కృష్ణకౌశిక్, ఎం.హర్షిత, సిహెచ్.బుజ్జిరాజు, ఎల్.దినేష్, జి.నిఖిల్, ఎ.అభిషేక్, ఎం.చరణ్‌తేజ సిల్వర్ పతకాలను కైవసం చేసుకున్నారు. ఈ మేరకు చిత్రలేఖన పోటీలలో గోల్డ్ పతకాలను సాధించిన విద్యార్థులతో పాటు తర్ఫీదునిచ్చిన ఆర్ట్ టీచర్ జి.అర్జునరావును మంగళవారం స్థానిక ప్రిన్సిపాల్ పి.రఘు, స్కూల్ చైర్మన్ నర్సింహమూర్తి, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.



జాతీయ ఆర్ట్స్ కాంపిటేషన్‌లో మెడల్స్ సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న గురుకుల ప్రిన్సిపాల్ పి.రఘు

వెలుగులో లావాదేవీల వివరాల కోసం దరఖాస్తు

కోటవురట్ల: వెలుగు సిబ్బంది భారీ స్థాయిలో అక్రమాలకు పాల్పడ్డారని జెడ్పీటీసీ సభ్యురాలు సిద్ధాబత్తుల ఉమాదేవి, మాజీ ఎంపీటీసీ యల్లపు కుమారరాజా ఆరోపించారు. ఇందుకోసం వెలుగు కార్యాలయంలో 2017 నుంచి నేటి వరకు జరిగిన వివిధ లావాదేవీల వివరాలను సమాచార హక్కు చట్టం ప్రకారం కోరుతూ ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, వెలుగు సిబ్బందికి మాజీ ఎంపీటీసీ యల్లపు కుమారరాజా మంగళవారం దరఖాస్తు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీటీసీ ఉమాదేవి మాట్లాడుతూ వీవోఏలు గ్రామ స్థాయిలో పలు అక్రమాలకు పాల్పడ్డారని, ఇందుకు సీసీలు కూడా సహకరించారని ఆరోపించారు. మాజీ ఎంపీటీసీ కుమారరాజా మాట్లాడుతూ 2017 నుంచి స్త్రీనిధి రుణాలు, ఉపకార వేతనాలు, పొదుపు తదితర వివరాలు, 2019లో అప్పటి ప్రభుత్వం ఇచ్చిన పసుపు కుంకుమ నిధుల వివరాలను సమగ్రం అందించాలని కోరుతూ సమాచార హక్కు చట్టం ప్రకారం దరఖాస్తు చేసినట్టు తెలిపారు.



ఎంపీడీవో కాశీవిశ్వనాథరావుకు దరఖాస్తు అందిస్తున్న జెడ్పీటీసీ ఉమాదేవి, మాజీ ఎంపీటీసీ కుమారరాజా

సబ్బవరంలో 25న ఉచిత వైద్య శిబిరం



ఉచిత వైద్య శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: అంతర్జాతీయ సహకార సంవత్సరం -2025 పురస్కరించుకుని ఈ నెల 25న సబ్బవరంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరం వాల్ పోస్టర్‌ను కలెక్టర్ విజయ కృష్ణన్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీదుర్గాంబ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ శిబిరం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి ఏపీ స్వరూపారాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బాలాజీ పాల్గొన్నారు.

సబ్సిడీ యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఏపీ అగ్రికల్చర్ కమిషనరేట్ అధికారులు
- ఎం.అలమండలో క్షేత్ర స్థాయి సందర్శన

దేవరాపల్లి: సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ యంత్ర పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీ వ్యవసాయ కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన ఏడీఏ ఆర్.శశిధర్‌రెడ్డి, ఏవో పి.సురేష్‌బాబు కోరారు. ఈ మేరకు అనకాపల్లి జిల్లా ఏవో ఆర్.గాయత్రి, మండల ఏవో వై.కాంతమ్మతో కలిసి కమిషనరేట్ అధికారుల బృందం సభ్యులు ఎం.అలమండ గ్రామంలో మంగళవారం క్షేత్ర స్థాయిలో పర్యటించారు. కేంద్ర ప్రభుత్వం 'ఆహార, పోషకాహార భద్రత' పథకంలో భాగంగా రాయితీపై మంజూరు చేసిన నూర్పిడి యంత్రాలను పరిశీలించారు. యంత్రాలను అర్హులకు అందించారా? లేదా?, లబ్ధిదారులకు భూమి ఉందా? లేదా? అని ఆరా తీశారు. బోయిలకింతాడ, ఎ.కొత్తపల్లి, చింతలపూడి గ్రామాల్లో నూర్పిడి యంత్రాల లబ్ధిదారులను సైతం ఎం.అలమండకు రప్పించి మాట్లాడారు. నూర్పిడి యంత్రంతో కలిగే ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ విస్తరణ అధికారి కిరణ్‌కుమార్, ఎంపీఈవో దివ్య, అసిస్టెంట్ జనార్దన్ పాల్గొన్నారు.



నూర్పిడి యంత్రాలపై లబ్ధిదారులను ఆరా తీస్తున్న అధికారులు

నాగజ్యోతికి ప్రైడ్ ఆఫ్ ఇండియా జాతీయ అవార్డు

రోలుగుంట: స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయినిగా పీవీఎం నాగజ్యోతి అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ప్రగ్యాన్ స్కోర్‌మోర్ ఫౌండేషన్ ప్రైడ్ ఆఫ్ ఇండియా–2025 జాతీయ అవార్డును ప్రదానం చేసింది. ఆంగ్ల భాషా బోధనలో వాక్య నిర్మాణం, శబ్దోచ్ఛారణ, పఠన నైపుణ్యం, రచనా నైపుణ్యం, భావ ప్రకటన వంటి అంశాలను ఆమె సరళమైన పద్ధతిలో విద్యార్థులకు నేర్పిస్తున్నారు. హైదరాబాద్ సురవరం ప్రతాప్‌రెడ్డి యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సినీ డైరెక్టర్ రేలంగి నరసింహారావు, సీనియర్ సినీ నిర్మాత తుమ్మలపల్లి సత్యనారాయణ పీవీఎం నాగజ్యోతికి ప్రైడ్ ఆఫ్ ఇండియా జాతీయ అవార్డును అందజేశారు.



సినీ డైరెక్టర్ రేలంగి నర్సింహారావు నుంచి అవార్డు అందుకుంటున్న నాగజ్యోతి

ప్రైవేట్ ఆస్పత్రులను ప్రోత్సహించడం తగదు

అనకాపల్లి: జిల్లాలోని పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాల్లో బాధితులకు సకాలంలో వైద్య సహాయం అందించాలన్న పేరుతో ప్రైవేట్ ఆస్పత్రులను ప్రోత్సహించాలనే ప్రభుత్వ ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అనకాపల్లిలో హెల్త్ సిటీ కింద 7.68 ఎకరాలను ప్రైవేట్ ఆస్పత్రులకు అప్పగించే వీఎంఆర్‌డీఏ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాల పేరుతో ప్రైవేట్ ఆస్పత్రులకు కారుచౌకగా భూములు అప్పగించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ ఆస్పత్రిలో బర్నింగ్ వార్డు, ఇతర మల్టీస్పెషాలిటీ తరహా వైద్యం సదుపాయాలు కల్పించాలని సూచించారు. అచ్యుతాపురంలో ఏర్పాటు చేస్తున్న ఈఎస్ఐ ఆస్పత్రిలో అన్ని వైద్య సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. టీసీఎస్‌కు విశాఖపట్నంలో ఎకరం 99 పైసలు చొప్పున 21 ఎకరాలు కారుచౌకగా కూటమి ప్రభుత్వం కేటాయించడం అన్యాయమన్నారు. ఇదే తరహాలో అనకాపల్లి జిల్లాలో ప్రభుత్వ భూములను ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు.

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా భరణి



నర్సీపట్నం: నర్సీపట్నం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా భరణి నియమితులయ్యారు. నర్సీపట్నంలో పని చేస్తున్న మధుసూదన్‌రావు కడప జిల్లా కమలాపురం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో శ్రీకాకుళంలో పని చేస్తున్న డి.భరణిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రెండు రోజుల్లో ఆమె బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిసింది.

శారదా నదిలో పడి పశువుల కాపరి మృతి

చోడవరం: ప్రమాదవశాత్తు శారదానదిలో పడి నందికోళ్ల దేముడు(63) మంగళవారం మృతిచెందాడు. అంబేరుపురానికి చెందిన దేముడు తన పశువులను శారదానది ఒడ్డున మేపడానికి తీసుకెళ్లాడు. అక్కడ పశువులను మేపుతూ పక్కనే నదిలో నీరు ఉన్న ప్రదేశానికి బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి అందులో పడిపోయాడు. అటుగా వెళుతున్న వారు గమనించి చోడవరం పోలీసు, అగ్నిమాపక కేంద్రాలకు సమాచారం అందజేశారు. అగ్నిమాపక సిబ్బంది శకటంతో వచ్చి నదిలో ఊబిలో చిక్కుకుపోయి మృతి చెందిన దేముడు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ అప్పలరాజు తెలిపారు.



మృతుడు దేముడు

అనారోగ్యంతో నవ వధువు ఆత్మహత్య

మునగపాక: పెళ్లయిన రెండు నెలలకే ఓ నవ వధువు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మునగపాకలో మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మునగపాక బీసీ కాలనీలో అప్పికొండ శ్రీనివాసరావు, నాగమణి దంపతులు నివాసం ఉంటున్నారు. వీరి కుమార్తె శరణ్యకు నాగమణి తమ్ముడైన శివకోటి శంకరప్రసాద్‌కు ఈ ఏడాది ఫిబ్రవరి 20న మునగపాకలో వివాహం జరిపించారు. అయితే ఆమె కొంత కాలంగా గైనిక్ సమస్యతో బాధపడుతోంది. సమస్య పరిష్కారం కాకపోవడంతో మంగళవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరిపోసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న మునగపాక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. శంకర ప్రసాద్ అనకాపల్లిలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు.



మృతురాలు శరణ్య

నిఘా వ్యవస్థ పటిష్టం

- ఎస్పీలకు డీఐజీ ఆదేశం

సాక్షి, విశాఖపట్నం: నేరాల నియంత్రణలో ఆధునిక సాంకేతికతను అనుసంధానం చేస్తూ సీసీ టీవీ, డ్రోన్లతో నిఘాను మరింత పటిష్టం చేయాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి ఆదేశించారు. విశాఖ రేంజ్ డీఐజీ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన అనకాపల్లి, అల్లూరి, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల ఎస్పీలతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. గంజాయి రవాణా, వినియోగ నియంత్రణ, నిందితుల అరెస్టు, వారి ఆస్తుల జప్తు, డీ-అడిక్షన్, సైబర్ క్రైం, సోషల్ మీడియా తదితర అంశాలపై సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల్లో నిందితులపై ప్రత్యేక హిస్టరీ షీట్లు తెరవాలని సూచించారు. సైబర్ క్రైమ్, సోషల్ మీడియా ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించడం అత్యంత అవసరమన్నారు. అనకాపల్లి, అల్లూరి జిల్లాల ఎస్పీలు తుహిన్ సిన్హా, అమిత్ బర్దర్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీలతో సమావేశమైన డీఐజీ గోపినాథ్ జెట్టి

నడింపల్లిలో అగ్ని ప్రమాదం

అచ్యుతాపురం రూరల్ : నడింపల్లి గ్రామంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ పూరిల్లు మంగళవారం దగ్ధమైంది. రూ.2.50 లక్షల మేర ఆస్తి నష్టం జరిగింది. వివరాలిలలా ఉన్నాయి. నడింపల్లికి చెందిన వడిశల సూరిబాబు కుటుంబ సభ్యులతో పూరింట్లో నివాసం ఉంటున్నారు. మంగళవారం ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగి వ్యాపించాయి. అంతలో అప్రమత్తమైన సూరిబాబు కుటుంబ సభ్యులు ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. చుట్టు పక్కల వారి సహాయంతో మంటలు ఆర్పే ప్రయత్నం చేస్తూనే అగ్నిమాపక అధికారులకు సమాచారం అందజేశారు. ఏపీఐఐసీ సెజ్ అగ్నిమాపక సిబ్బంది సత్యంనాయుడు, రాజాన రమేష్, ప్రసాద్, అప్పలనాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. వైద్య ఖర్చుల నిమిత్తం దాచుకున్న రూ.లక్ష నగదు, 35 నాటుకోళ్లు, ఫర్నిచర్, ఎల్రక్టానిక్ పరికరాలు, ఇతర గృహోపకరణాలు, ఇంటి పక్కన ఉన్న గడ్డికుప్ప కాలి బూడిదయ్యాయి. సర్వం కోల్పోయిన బాధితులను గ్రామస్తులు ఓదార్చి తాత్కాలికంగా ఆహారం, వస్త్రాలు అందజేశారు. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకుని తగు న్యాయం చేయాలని కోరారు.



బూడిదైన గృహోపకరణాలు

క్లుప్తంగా

26న మండల సర్వసభ్య సమావేశం

కశింకోట: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 26న ఉదయం 10.30 గంటలకు కశింకోట ఎంపీపీ సమావేశ మందిరంలో జరగనుందని ఎంపీడీవో వి.వి. రవికుమార్ తెలిపారు. ఎంపీపీ కలగా లక్ష్మి అధ్యక్షతన జరిగే సమావేశంలో మండల సమస్యలపై చర్చించనున్నట్లు చెప్పారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు సమావేశానికి హాజరు కావాలన్నారు.

ఉత్సవ కమిటీ సభ్యులకు సత్కారం



ఉత్సవ కమిటీ సభ్యులను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని చేపలబజార్ వద్ద సీతారామాలయంలో ఇటీవల శ్రీరామనవమి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించిన 21 మంది ఉత్సవ కమిటీ సభ్యులను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు కొణతాల జగన్నాథరావు, అధ్యక్షుడు కె. నారాయణరావు మాస్టారు. కార్యదర్శి సిరసపల్లి సూరిబాబు, కోశాధికారి వాసిరెడ్డి వెంకటేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాల పూర్తి



హౌసింగ్ అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ రమణ

అనకాపల్లి టౌన్: మండలంలోని గొలగాం లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్ రమణ తెలిపారు. స్థానిక జీవీఎంసీ కమిషనర్ చాంబర్‌లో హౌసింగ్ అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న గృహాలను తక్షణమే పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలన్నారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ పింకి, ఏపీడీ సంతోష్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ధాత్రి దినోత్సవం



ధాత్రి దినోత్సవ ప్రాధాన్యం వివరిస్తూ విద్యార్థుల ప్రదర్శన

కశింకోట: మండలంలోని వెదురుపర్తి హైస్కూలులో ప్రపంచ ధాత్రి దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భూమి వల్ల కలుగుతున్న ప్రయోజనాలను వివరిస్తూ బొమ్మలు వేసి విద్యార్థులు ప్రదర్శించారు. హెచ్‌ఎం ఎ.వి.ఎస్. మూర్తి మాట్లాడుతూ భూమి ద్వారా గాలి, నీరు, ఆహారం, అడవులు, సహజ వనరులు లభ్యమవుతున్నాయన్నారు. వాటిని కాపాడి భావితరాలకు అందివ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 1,196 దిమ్మలు వచ్చాయి..

దిమ్మల రకం	కనిష్టధర	గరిష్టధర
మొదటి రకం	3,900	4,470
రెండో రకం	3,380	4,200
మూడో రకం	3,180	3,340

అనకాపల్లి సినిమాలు

రాజా : మ్యాడ్ స్క్వేర్
సత్యనారాయణ స్క్రీన్-1: అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి
సత్యనారాయణ స్క్రీన్-2 : గుడ్ అండ్ బ్యాడ్ అగ్లీ
పర్తిసాయి : ఓదెలా-2
షిర్డీసాయి : అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి
వెంకటేశ్వర : కోర్టు
శ్రీసత్య : మధురం
రామచంద్ర : జాక్

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 36 యూనిట్లు రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6 యూనిట్లు, బీ పాజిటివ్-8, ఓ పాజిటివ్-21, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యూ లోకేష్‌ను (9703619706) సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 383 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 326 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.



మండలంలో సీతానగరంలో ఉపాధి కూలీలు

గిట్టుబాటు కాని కూలి..



ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ప్రతి కూలీకి రూ.307 పెంచినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేసింది. వాటిని అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. మండలంలో పనిచేస్తున్న ఒక్కొక్క కూలీకి సరాసరి రూ.220 నుంచి రూ.270 వరకే వేతనం అందజేస్తోంది. పూర్తిస్థాయిలో రూ.307 ఒక్క కూలీకీ ఇవ్వడం లేదు. దాదాపు ఒక్కొక్క కూలీకి రూ.10 వేల నుంచి రూ.18 వేల వరకూ బకాయిలు పేరుకుపోయాయి. ఒక్కొక్క కుటుంబంలో ఇద్దరేసి వ్యక్తులు ఉపాధి పనులకు వెళ్తున్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా పలు అభివృద్ధి పనులు, రోడ్లు, మినీ గోకులాల నిర్మాణం తదితర పనులు చేస్తుంటారు.

కూలి అందక.. ఆకలి కేక



వెంకుపాలెంలో ఉపాధి కూలీలు

- ఉపాధి వేతనదారుల బకాయిలు రూ.కోటి
- 4 నెలలుగా జమకాని నగదు
- పనిచేసే ప్రదేశాల్లో వసతులు కరువు

అనకాపల్లి: గ్రామాల్లో వలసలు నివారించేందుకు అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అభాసుపాలవుతోంది. మండలంలో కూలీలకు చెల్లించాల్సిన వేతనాలు ఈ ఏడాది జనవరి 20 నుంచి నేటివరకూ ఒక్క రూపాయి ప్రభుత్వం చెల్లించలేదు. రూ.కోటి పైగా ఉపాధి కూలీల బకాయిలు ఉన్నాయి. ఆర్థిక సంవత్సరం ముగిసినప్పటికీ కూలీల్లో వెలుగులు నింపడంలో విఫలమైంది. రోజువారి కూలీల హాజరు వేస్తూ, బిల్లులు కంప్యూటర్లో జనరేట్ చేస్తున్నా, నగదు మాత్రం వారి బ్యాంక్ ఖాతాల్లో జమ కావడం లేదు. మండలంలో 32 పంచాయతీ పరిధిలో 6 వేల మంది కూలీలు పని చేస్తున్నారు. కష్టాన్ని నమ్ముకుని పనిచేస్తున్న వీరికి మూడు మాసాలుగా కూలి ఇవ్వకపోవడంతో ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. దీనికితోడు పనులు చేసే ప్రదేశాల్లో వేసవి దృష్టిలోపెట్టుకుని కనీస మౌలిక సదుపాయలు కల్పించడం లేదు. పనులు చేసే సమయంలో ప్రమాదాలు జరిగితే ప్రథమ చికిత్స చేసేందుకు కనీసం కిట్లు లేవు. వడదెబ్బకు గురైన వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచలేదు.

ఉపాధి కూలీల సమస్యలు...

- వారానికి ఒక్కొక్క మనిషికి రూ. 2 వేల నుంచి రూ.3 వేలు బకాయిలు..
- ఏప్రిల్ నుంచి ఒక్కొక్క కూలీకి రూ.307 ప్రభుత్వం అమలు చేసింది.
- మొత్తం బకాయిలు సుమారుగా రూ.కోటి ఉంది.
- ఉపాధి పనులు చేసే ప్రదేశాల్లో వేసవి దృష్టిలో పెట్టుకుని షామియానాలు, తాగునీరు, మెడికల్ కిట్స్ సరఫరా చేయడంలో విఫలమైంది.
- కార్మికులకు పనిముట్లు ఇవ్వలేదు. కూలీలే స్వయంగా పనిముట్లు తీసుకుని వచ్చి పనులు చేస్తున్నారు.
- రోజూ ఉదయం 6 నుంచి 10.30 గంటల వరకూ కూలీలు ఎండలో విధులు నిర్వహిస్తారు.
- టెంట్లు లేకపోవడంతో అత్యధిక ఉష్ణోగ్రతలతో ఇబ్బందులు పడుతున్నారు.
- ఫీల్డ్ అసిస్టెంట్లు 19 సంవత్సరాలుగా విదులు నిర్వహిస్తున్నప్పటికి ఉద్యోగ భద్రత లేదు.
- ఫీల్డ్ అసిస్టెంట్‌కు సుప్రీంకోర్టు ఆదేశాలు మేరకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలి. కానీ ప్రభుత్వాలు నెలకు రూ.9 వేలు మాత్రమే గౌరవవేతనంగా ఇస్తున్నాయి.
- ఒక్కొక్క ఫీల్డ్ అసిస్టెంట్‌కు ఒక్కొక్క పంచాయతీలో నాలుగు లేదా ఐదు కూలీలు పని చేసే ప్రాంతాల వద్దకు వెళ్లే సమయంలో రవాణా ఖర్చులు అవుతున్నాయి. ఇచ్చిన గౌరవ వేతనంలో సగం రవాణాకు ఖర్చు అవుతుంది. దీనిపై ప్రభుత్వాలు దృష్టి సారించాలి.
- కూలీలు ఎండ తీవ్రతకు డీహైడ్రేషన్‌కు లోనైతే ఓఆర్ఎస్ ద్రావణాలు అందుబాటులో లేకపోవడం గమనార్హం
- కూలీలు ఆరోగ్య భద్రతపై అధికారులు దృష్టి పెట్టాలి.

11 వారాలుగా కూలి ఇవ్వలేదు

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పనులకు వెళ్తేగాని పూట గడవదు. 11 వారాలుగా మా కూలి ఇవ్వలేదు. దీంతో కుటుంబాన్ని నెట్టుకొచ్చే పరిస్థితి ఇబ్బందిగా ఉంది. పనులు చేసినప్పటికీ నగదు రాకపోవడంతో తెలిసిన వ్యక్తులు వద్ద అప్పులు చేసుకుని జీవనం సాగిస్తున్నాం.

– పి.అప్పారావు, సీతానగరం, అనకాపల్లి మండలం

కూర్చోడానికి నీడే లేదు

ఉపాధి హామీ పనుల వద్ద షామియానాలు, తాగునీరు, మెడికల్ కిట్స్ ఏర్పాటు చేయాలి. ఇవి ప్రభుత్వం ఇవ్వకపోవడంతో కూలీలు చందాలు వేసుకుని కొన్ని ప్రాంతాల్లో సర్దుకుపోతున్నారు. పనిముట్లు ఇవ్వలేదు. పనిచేసే ప్రాంతాల్లో గాయాలైతే దగ్గరలో ప్రైవేట్ ఆస్పత్రిని సంప్రదిస్తున్నాం. నెల రోజులుగా పనులు చేస్తున్నాం. ఒక్క డాక్టర్ పని ప్రదేశం వద్దకు రాలేదు.

– ఎస్.సూరిబాబు, వెంకుపాలెం గ్రామం, అనకాపల్లి మండలం

రెండు, మూడు రోజుల్లో అందజేస్తాం

కూలీల బకాయిలు ఉన్నమాట నిజం. ప్రభుత్వాల ఆదేశాలు మేరకు రెండు, మూడు రోజుల్లో కూలీల బ్యాంక్ ఖాతాలో వేతనాలు జమ చేయనున్నాం. ఉపాధి కూలీల సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తాను.

– కె.వి.నరసింహరావు, ఎంపీడీవో, అనకాపల్లి

పాఠశాలలో చేర్పించాలని ప్రచారం



విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులను అభ్యర్థిస్తున్న ఉపాధ్యాయులు

కశింకోట: స్థానిక డీపీఎస్ జెడ్పీ హైస్కూలు ఉపాధ్యాయులు బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలని కోరుతూ మంగళవారం పలు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఎంఆర్‌వీ అప్పారావు, ఉపాధ్యాయులు ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాల గురించి వివరించి చైతన్యపరిచారు. తల్లిదండ్రులను కలిసి విద్యార్థులను చేర్చుకోవడానికి అంగీకార పత్రాలను తీసుకున్నారు. తేగాడ, కొత్తూరు, తమ్మయ్యపేట గ్రామాలు, సత్తెమ్మ కాలనీ ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

చిన్నారుల స్నాతకోత్సవం



పట్టభద్రుల వేషధారణలో చిన్నారులు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని హ్యాపీ కిడ్స్ ప్లే స్కూల్లో స్కూల్ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులతో ఏర్పాటు చేసిన నాటిక పోటీలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. యూకేజీ పూర్తి చేసిన విద్యార్థులు పట్టభద్రుల వేషధారణలో కస్పాండెంట్ శెట్టి గిరిష్ కుమార్ నుంచి పట్టాలు, జ్ఞాపికలను అందుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, మళ్ల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్‌తో మర్యాద పూర్వక భేటీ



వైఎస్ జగన్‌తో భరత్‌కుమార్, జానకీరామరాజు

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం తాడేపల్లి కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. భరత్‌కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో గ్రామీణ స్థాయి నుంచి పార్టీ అభివృద్ధికి కృషి చేయడమే కాకుండా కొత్త కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. జీవీఎంసీ మేయర్‌పై అవిశ్వాస తీర్మానంలో అనకాపల్లి కార్పొరేటర్లు నిబద్ధత చాటారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మలసాల భరత్‌కుమార్, కశింకోట మండల అధ్యక్షుడు మలసాల కిషోర్, రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, అనకాపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు కలగ గున్నయ్యనాయుడు, మలసాల కుమార్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

వుడా భూమిలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఏర్పాట్లు!



ఇరువర్గాల మధ్య ఘర్షణ

పెదగంట్యాడ: ప్రభుత్వ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు రంగం సిద్ధం చేశారు. దీంతో గాంధీనగర్ వాసులు మంగళవారం అడ్డుకున్నారు. జీవీఎంసీ 73వ వార్డు పరిధిలోని చిన నడుపూరులో నూకాంబిక ఆలయం వెనుక గెడ్డ ఉంది. దానికి ఆనుకొని జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని గాంధీనగర్ ప్రాంతం ఉంది. అక్కడ స్థలం ఖాళీ ఉండడంతో స్థానికులు కొంతమంది అక్కడ చిన్న చిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు.. ఆయా దుకాణాల యజమానులు ఆలయ కమిటీకి ప్రతి నెలా అద్దె రూపంలో రూ.1000 నుంచి రూ.2వేల వరకూ చెల్లిస్తున్నారు.. ఆ అద్దె డబ్బులతోనే ఆలయాన్ని నిర్వహిస్తున్నారు.

అయితే ఇప్పుడు దుకాణాలను తొలగించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు సన్నాహాలు ప్రారంభించారు.దీనిపై సమాచారం అందుకున్న గాంధీనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, గాంధీనగర్ వాసులతో కలసి అడ్డుకున్నారు. దీంతో అక్కడ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది..పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఇరువర్గాలతో చర్చలు జరిపారు. అది వుడాకు చెందిన స్థలమంటూ గాంధీనగర్ వాసులు చెబుతుండగా, అది గెడ్డ స్థలమని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ స్థలం విషయంలో వీఎంఆర్‌డీఏ , రెవెన్యూ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

స్మార్ట్ మీటర్లు వద్దు.. పాత మీటర్లే ముద్దు



మాడుగులలో వాల్ పోస్టర్లతో నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

మాడుగుల రూరల్: విద్యుత్ చార్జీలు పెంచబోమని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీని తుంగలోకి తొక్కి అధికారంలోకి వచ్చిన తర్వాత స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి వినియోగదారులపై భారం మోపడంపై సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. మాడుగుల బస్టాండు ఆవరణలో స్మార్ట్ విద్యుత్ మీటర్లు వద్దు.. పాత మీటర్లు ముద్దు అంటూ వాల్ పోస్టర్లు పట్టుకుని సీపీఎం నాయకులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి ఇరటా నర్సింహమూర్తి మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టీడీపీ నాయకులు స్మార్ట్ మీటర్లు వద్దని, వాటిని పెడితే పగలుగొట్టాలని పిలుపునిచ్చారని, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం షాపులు, ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని చెప్పారు. విద్యుత్ బిల్లులో రూ.15 వేలు వాయిదా పద్ధతిలో వసూలు చేయడం దారుణమన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో వాడుకున్న విద్యుత్ బిల్లులు చెల్లించినా సరే సర్దుబాటు చార్జీలు పేరుతో భారం వేయడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కర్రి నాగరాజు, గాలి కిరణ్‌కుమార్, షేక్ చాందిని, మహేశ్, పెంటోజీ, తదితరులు పాల్గొన్నారు.

26న హనుమాన్ శోభాయాత్ర

అనకాపల్లి: పట్టణంలో సుంకరమెట్ట జంక్షన్ నుంచి శారదానది ఒడ్డు వరకూ ఈ నెల 26న మధ్యాహ్నం 3 గంటలకు హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నట్టు అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ల ప్రవీణ్‌కుమార్ తెలిపారు. స్థానిక జోనల్ కార్యాలయంలో జెడ్సీ బి.వి.రమణకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ శోభాయాత్రకు జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు హాజరవుతారన్నారు. సుంకరమెట్ట జంక్షన్ నుంచి శారదానది ఒడ్డు వరకూ రహదారిని పారిశుద్ధ్య సిబ్బందితో శుభ్రం చేయించాలని కోరారు. వేసవి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటున్నాయని, శోభాయాత్రకు వచ్చే భక్తులకు పరిశుభ్రమైన తాగునీటిని సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు కుంచా చిన్ను, బడి అప్పారావు, ఎన్.చిరంజీవి, ముగడ అప్పారావు, ఎస్.గణపతి, విశ్వహిందూ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

బైకు, 2 కేజీల గంజాయి స్వాధీనం

ఎస్.రాయవరం: పెదగుమ్ములూరు సమీపంలో సర్వీపట్నం ఆర్‌అండ్‌బీ రోడ్డుపై వాహనాలు తనిఖీ చేస్తుండగా బైకుపై ఇరువురు వ్యక్తులు రెండు కేజీల గంజాయి తీసుకువస్తూ పట్టుబడ్డారని ఎస్‌ఐ విభీషణరావు తెలిపారు. తుని పట్టణానికి చెందిన కప్పరాతి శ్రీను, రామిశెట్టి సాయిబాబా బైకుపై వస్తుండగా వాహనాల తనిఖీ సమయంలో పట్టుబడ్డారన్నారు. వీరిద్దరు గంజాయి తాగేందుకు ఏజెన్సీ నుంచి తీసుకువస్తున్నట్టు చెప్పారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ఇద్దరిని తీసుకుని గంజాయి, బైకు సీజ్ చేశామన్నారు.

సబ్సిడీపై మల్టీ క్రాప్ థ్రెషర్ యూనిట్లు



మల్టీ క్రాప్ థ్రెషర్ మిషన్ పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

అనకాపల్లి టౌన్: జాతీయ ఆహార భద్రత పథకం, వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా జిల్లాకు 21 మల్టీ క్రాప్ థ్రెషర్ యూనిట్లు వచ్చాయని మండల వ్యవసాయాధికారి రంగాచారి తెలిపారు. మండలంలోని పిసినిగాడ గ్రామంలో రైతులకు సరఫరా చేసిన యూనిట్‌ను మంగళవారం వ్యవసాయ శాఖ కమిషనరేట్ నుంచి వచ్చిన అధికారులు పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఒక్కొక్క యూనిట్ విలువ రూ.2.60లక్షలు, జనరల్, బీసీ కేటగిరీకి రూ.80 వేలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.లక్ష సబ్సిడీ ఉంటుందన్నారు. ఏడీఏ శశిధర్ రెడ్డి, ఏవో సురేష్‌బాబు, వివిధ మండలాల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

కూడళ్లలో విస్తృతంగా వాహన తనిఖీలు

- 27 మందిపై కేసుల నమోదు




వేపగుంట కూడలి వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ సతీష్‌కుమార్, సిబ్బంది

పెందుర్తి: పెందుర్తి, వేపగుంట కూడళ్ల వద్ద పెందుర్తి పోలీసులు మంగళవారం సాయంత్రం ఆకస్మిక వాహన తనిఖీలు చేపట్టారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో రెండు బృందాలుగా ఏర్పడిన పోలీసులు అన్ని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. హెల్మెట్, ఇతర రికార్డులు లేని 25 మందిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు. మద్యం సేవించి పట్టుబడిన ఇద్దరిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేశామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడితే రూ.10 వేల జరిమానా విధిస్తామన్నారు. ఎస్‌ఐ అసిరితాత, సిబ్బంది పాల్గొన్నారు.

మ్యుటేషన్ చేయకుండా తిప్పుతున్నారు

రాంబిల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయింపు



రాంబిల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించిన భోగాపురం బాధితులు

రాంబిల్లి(అచ్యుతాపురం): సాంకేతిక విప్లవం ఎంత అందుబాటులోకి వచ్చినప్పటికీ భూ వివాదాలు, సమస్యలు ఇంకా కొనసాగుతున్నాయి. రాంబిల్లి మండలంలోని పంచదార్ల శివారు భోగాపురానికి చెందిన వీరాస్వామి,కే.నారాయణల తండ్రి నుంచి దఖలు పడిన భూమి మ్యూటేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ మ్యూటేషన్ చేయడం లేదంటూ సదరు బాధిత కుటుంబీకులు మంగళవారం రాంబిల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. వీఆర్వో, ఆర్‌ఐ, సర్వేయర్, జిల్లా సర్వేయర్లు అనుకూలంగా సర్వే రిపోర్టు ఇచ్చినప్పటికీ నాలుగు నెలలుగా మ్యుటేషన్ చేయకుండా కాలయాపన చేస్తున్నారని, తమకు న్యాయం చేయాలని తహసీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించారు.

చెరకులో కొరడా తెగులు



మాట్లాడుతున్న ఏడీఆర్ ముకుందరావు

అనకాపల్లి: చెరకులో ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు కొరడా తెగులు ఆశించే అవకాశం ఉందని, నివారణకు ప్రొఫికొనజోల్ 1మి.లీ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెరకులో పీక పురుగు ఆశించవచ్చని, నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 0.3 మి.లీ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకుని పోషక విలువలున్న చెరకు చెత్తను పొలంలో వేసుకోవాలన్నారు. వాతావరణ పరిస్థితుల వల్ల కాయ ఏర్పడు దశలో బొప్పాయిలో రసం పీల్చుపురుగు ఆశించే అవకాశం ఉందని, లీటరు నీటికి 0.3 గ్రా. ఇమిడాక్లోప్రిడ్‌ను కలిపి పిచికారీ చేయాలని సూచించారు. బీర, కాకర, ఆనప వంటి కాయగూరల పంటలలో రసం పీల్చు పురుగులు ఆశించవచ్చని, 2 మి.లీ. డైమిథోయేట్ లేదా 1.6 మి.లీ. మోనోక్రోటోఫాస్ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. ఖాళీ పొలాల్లో మట్టి నమూనాను సేకరించి విశ్లేషణ చేసినట్లయితే రాబోయే ఖరీఫ్‌లోఓ భూసారం తగినట్లుగా యాజమాన్య పద్ధతులు చేపట్టవచ్చుని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు కె.వి.రమణమూర్తి, డి.ఉమామహేశ్వరావు, వి.గౌరి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పనకు జాబ్‌మేళాలు



జాబ్ మేళా కార్యక్రమంలో మాట్లాడుతున్న గోవిందరావు

తుమ్మపాల: జాబ్‌మేళాల ద్వారా స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.గోవింద రావు తెలిపారు. పట్టణంలో ఆదినారాయణ మహిళా డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మెగా జాబ్‌మేళా జరిగింది. 15 మల్టీ నేషనల్ కంపెనీల ప్రతినిధులు చేపట్టిన ఇంటర్వ్యూల్లో 1,100 వరకు ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. పది నుంచి పీజీ వరకు (ఐటీ, డిప్లొమా, బీటెక్, బీబీఏఎం, బీఏ, బీకాం, బీఎస్సీ) అర్హత కలిగిన నిరుద్యోగ యువతకు అవకాశం కల్పించామన్నారు. మొత్తం 455 మంది నిరుద్యోగులు హాజరయ్యారని, వారిలో 171 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారన్నారు. 50 మందికి తక్షణమే ఉద్యోగ నియామక పత్రాలు అందించామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పది ఫలితాల కోసం ఎదురుచూపు

కశింకోట: మండలంలో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు బుధవారం వెలువడనున్న ఫలితాల కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 1,037 మంది పరీక్షలు రాశారు. వీరిలో 13 జెడ్పీ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, బాలికల గురుకుల పాఠశాల, మోడల్ స్కూళ్ల నుంచి 833 మంది, 9 ప్రైవేటు పాఠశాలల నుంచి 204 మంది ఉన్నారు. అత్యధికంగా 635 మంది బాలికలుండగా, మిగిలిన 402 మంది బాలురు ఉన్నారు. ఈ నేపథ్యంలో వెలువడనున్న పరీక్షల ఫలితాల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి ఉత్కంఠ భరితంగా ఎదురు చూస్తున్నారు. ఫలితాలను అనుసరించి తమ అభీష్టం మేరకు ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్, వృత్తి విద్యా కోర్సులు, ఐటీఐ తదితర ఉన్నత విద్య అభ్యసించడానికి సమాయత్తమవుతున్నారు.